సాక్షి
రంగారెడ్డి
శనివారం । 30 । నవంబర్ । 2024



ఈజీ మనీ కోసమే కిడ్నాప్
వ్యాపారిని కిడ్నాప్ చేసి కణతకు గన్ పెట్టి బెదిరించిన కేసులో ఐదుగురు నిందితులను రిమాండ్‌కు తరలించారు. 8లో ▸



నాణ్యమైన భోజనం ఇవ్వాలి
గురుకుల విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతుందని ఏబీవీపీ విభాగ్ కన్వీనర్ సూర్యప్రకాశ్ మండిపడ్డారు. 8లో ▸



బుగ్గ జాతరపై డీసీపీ సమీక్ష
ఆరుట్ల బుగ్గ రామలింగేశ్వర స్వామి జాతరను మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి శుక్రవారం సమీక్షించారు. 8లో ▸

న్యూస్‌రీల్

ఓపెన్ స్కూల్‌లో స్పెషల్ అడ్మిషన్లు

కడ్తాల్: దూర విద్యా విధానంలో పదవతరగతి, ఇంటర్మీడియట్ (సింగిల్ సిట్టింగ్) పూర్తి చేయాలనుకునే వారికి తెలంగాణ ఓపెన్ స్కూల్(టాస్) అవకాశం కలిపిస్తోందని జెడ్పీహెచ్ఎస్ పాఠశాల(బాలుర) హెచ్ఎం జంగయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ విద్యాసంవత్సరానికి సంబంధించి అడ్మిషన్స్ ముగిసినప్పటికీ ప్రభుత్వం డిసెంబర్ 2 నుంచి డిసెంబర్ 12 వరకు ప్రత్యేక అడిషన్లు తీసుకునేందుకు నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు కోఆర్డినేటర్ జంగయ్యను సంప్రదించాలన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి

డీపీఓ సురేశ్‌మోహన్



తుమ్మలూరు ప్రభుత్వ పాఠశాలలో భోజనం చేస్తున్న డీపీఓ సురేశ్‌మోహన్

మహేశ్వరం: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఇస్తున్న మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలని జిల్లా పంచాయతీ అధికారి సురేశ్‌మోహన్ సూచించారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని తుమ్మలూరులోని ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో మెనూ ప్రకారమే భోనాలు వడ్డించాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలుంటాయన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీఓ కె.లక్ష్మీనారాయణ, ఎంపీఓ రవీందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అలివేలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆసరా పెన్షన్ హామీ అమలు చేయాలి

ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షుడు భుజంగరెడ్డి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగులు

షాద్‌నగర్: ప్రభుత్వం దివ్యాంగులకు ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని ఎన్‌పీఆర్‌డీ (దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక) జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి భుజంగరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం సంఘం సభ్యులు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భుజంగరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆసరా పెన్షన్ రూ.6వేలకు పెంచుతామని రేవంత్‌రెడ్డి ప్రకటించారని గుర్తు చేశారు. ఏడాది కావొస్తున్నా నేటికీ హామీ అమలు చేయడం లేదన్నారు. జీఓ–17ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సదరం సర్టిఫికెట్లను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని కోరారు. దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాలని, విద్యాంగుల శాఖల్లోని ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తున్న మహిళా శక్తి క్యాంటీన్లలో దివ్యాంగులకు ఐదు శాతం కేటాయించాలని, తీవ్ర వైకల్యం ఉన్న దివ్యాంగులకు ప్రత్యేక అలవెన్స్‌ను ఇవ్వాలన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చేగూరి శేఖర్‌గౌడ్, నాయకులు వేముల కుసుమ, సంతోష, గౌసియా తదితరులు ఉన్నారు.

నిమ్స్‌లో రోగులకు పండ్ల పంపిణీ

బంజారాహిల్స్: దీక్షా దివస్ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు నిమ్స్ ఆస్పత్రిలో రోగులకు పండ్లను పంచిపెట్టారు. తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగా మాజీ ముఖ్యమంత్రి, అప్పటి ఉద్యమ నేత కేసీఆర్ దీక్షకు దిగిన రోజును బీఆర్ఎస్ ఉత్సవంగా నిర్వహించింది. ఈ సందర్భంగా నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు ఎమ్మెల్సీ మధుసూదనాచారి, మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, కార్పొరేటర్లు వెల్దండ వెంకటేష్, రాజ్‌కుమార్‌పటేల్, దేదీప్య తదితరులు హాజరై పండ్లను పంపిణీ చేశారు.

ముచ్చటగా.. 3 మార్కెట్లు

ఒకేచోట పండ్లు, పూలు, కూరగాయలు



- కోహెడ కేంద్రంగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్
- ఇప్పటికే 199.12 ఎకరాలతో డీపీఆర్ సిద్ధం
- కొత్తగా మరో 45 ఎకరాల సేకరణకు సన్నాహాలు
- రూ.400 కోట్లతో పనులకు జనవరిలో శంకుస్థాపన

సాక్షి, రంగారెడ్డి జిల్లా: రాష్ట్రంలో తొలి సమీకృత మార్కెట్ త్వరలో అందుబాటులోకి రానుంది. పండ్లు, పూలు, కూరగాయల క్రయవిక్రయాలు నిర్వహించేలా సరికొత్త మార్కెట్‌కు వచ్చే ఏడాది జనవరిలో అంకురార్పణ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే కోహెడలో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించతలపెట్టిన పండ్ల మార్కెట్‌లోనే పూలు, కూరగాయల మార్కెట్ కూడా ఉండేలా డిజైన్ చేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తాజాగా చేసిన సూచనలతో సమీకృత మార్కెట్ నిర్మాణ దిశగా మార్కెటింగ్ శాఖ ప్రతిపాదనలు తయారు చేస్తోంది.

అన్ని వసతులు కల్పించేలా..

పండ్ల మార్కెట్ కోసం ఇప్పటికే కోహెడ కేంద్రంగా 199.12 ఎకరాలు సేకరించిన ప్రభుత్వం.. తాజాగా మరో 45 ఎకరాలు సేకరించనుంది. మొత్తం 215 ఎకరాల్లో రూ.2 వేల కోట్ల అంచనా వ్యయంతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు వచ్చే ఏడాది ఆరంభంలో భూమి పూజ చేయాలని సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఇప్పటికే 199.12 ఎకరాల్లో డీపీఆర్ సిద్ధం చేసిన మార్కెటింగ్ శాఖ.. ఫేజ్–1లో భాగంగా రూ.400 కోట్ల అంచనాతో నాలుగు షెడ్లు, రెండు శీతల గిడ్డంగులు సహా పరిపాలనా భవనం, రిటైల్ షాపులు, రెండు వైపులా రెండు పెట్రోల్ బంకులు అందుబాటులోకి రానున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలు అందించేందుకు అవసరమైన ఆస్పత్రి, నిరంతర విద్యుత్ సరఫరా కోసం ప్రత్యేక సబ్‌స్టేషన్ నిర్మాణం, అగ్నిమాపక కేంద్రం, వ్యర్థాల నిర్వహణ కేంద్రం, వర్తక, వ్యాపారుల కోసం ప్రత్యేక విశ్రాంత భవనం, ఉద్యోగుల నివాసాలు సహా పలు నిర్మాణాలు చేపట్టనుంది. హోల్‌సేల్ సహా 62 రిటైల్ షాపులు కూడా ఏర్పాటు చేయనున్నారు.

మెజారిటీ ఆదాయం అద్దె చెల్లింపులకే

- కొత్తపేటలోని గడ్డి అన్నారం పండ్ల మార్కెట్‌ను ట్రాఫిక్ రద్దీ నియంత్రణ పేరుతో మూడేళ్ల క్రితం కోహెడ మార్కెట్‌కు తరలించిన విషయం తెలిసిందే. భారీ ఈదురు గాలులతో కూడిన వర్షానికి తాత్కాలిక షెడ్లు నేలకూలడం, ప్రత్యామ్నాయంగా బాటసింగారంలోని ట్రక్ పార్క్‌ను ఇందుకు ఎంపిక చేసిన విషయం తెలిసిందే. అప్పటి వరకు ఈ మార్కెట్‌పై ఆధారపడిన 307 మంది కమీషన్ ఏజెంట్లు ఆ తర్వాత చెట్టుకొకరు.. పుట్టకొకరు అన్నట్లుగా వెళ్లిపోయారు. మార్కెట్‌కు వచ్చే పండ్లే కాదు.. టర్నోవర్ కూడా తగ్గింది. నెలకు రూ.70 లక్షలకుపైగా అద్దె చెల్లించాల్సి వస్తోంది.
- ఆదాయమంతా అద్దెలకే ఖర్చు అవుతుండటంతో కోహెడ మార్కెట్‌ను సాధ్యమైనంత త్వరగా పనులు చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి భావించారు. పండ్లతో పాటు పూలు, కూరగాయల మార్కెట్‌ను కూడా ఇక్కడే ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆ మేరకు అవసరమైన భూమిని సేకరించాల్సిందిగా జిల్లా యంత్రాంగానికి సూచించారు. పక్కనే ఉన్న వక్ఫ్‌భూమిని ఇందుకు ఎంపిక చేసి, సీఎం ఆమోదం కోసం పంపినట్లు సమాచారం. ఇప్పటికే 199 ఎకరాల్లో రూపొందించిన డీపీఆర్‌లో ఇటు ఓఆర్ఆర్ నుంచి, అటు సంఘీ టెంపుల్ నుంచి రెండు దారులను ప్రతిపాదించారు. ఓఆర్ఆర్ వైపు ఉన్న ప్రధాన మార్గంలో టోల్‌గేట్ సహా అత్యాధునిక వేబ్రిడ్జిలు ఏర్పాటు చేయనున్నారు. కుళ్లిన పండ్లు, ఆకులు, గడ్డి వంటి వ్యర్థాల నిర్వహణ కోసం ప్రత్యేక ఎస్టీపీకి ప్రణాళిక రూపొందించారు.

జీవ వైవిధ్య పరిరక్షణ అందరి బాధ్యత

మేయర్ గద్వాల్ విజయలక్ష్మి



సదస్సులో పాల్గొన్న మేయర్ విజయలక్ష్మి

సనత్‌నగర్: పట్టణ జీవ వైవిధ్యాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గ్రేటర్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. జాతీయ బయో డైవర్సిటీ అథారిటీ, ఐసీఎల్ఈఐ సంయుక్తాధ్వర్యంలో శుక్రవారం బేగంపేటలోని ఓ హోటల్‌లో నిర్వహించిన సదస్సులో మేయర్ ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఆరోగ్యకర నగరాల్లో పట్టణ జీవవైవిధ్యం అత్యంత కీలకమైందన్నారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో గాలి, నీటి నాణ్యత నుంచి పట్టణ పర్యావరణ వ్యవస్థల మొత్తం స్థితిస్థాపకత వరకు ప్రభావితం చేస్తుందన్నారు. పట్టణ వ్యవస్థను మరింత పటిష్టంగా ఉండడానికి జీవ వైవిధ్యం ఉపయోగపడుతుందన్నారు. అర్బన్ బయోడైవర్సిటీ పరిరక్షణలో భాగ్యనగరం గుర్తింపు పొందిందన్నారు. విభిన్న పర్యావరణ వ్యవస్థలు, పచ్చదనం పెంపు, ప్రకృతితో అనుసంధానం చేసే ప్రణాళికలు అమలు చేయడం ద్వారా ఇతర నగరాలకు హైదరాబాద్ మోడల్‌గా నిలుస్తోందన్నారు. హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ మాట్లాడుతూ.. పట్టణాభివృద్ధి ప్రణాళికలో బయోడైవర్సిటీని ఒక అంతర్భాగంగా తీసుకోవడం అవసరమన్నారు. పచ్చదనాన్ని ప్రోత్సహించడంలో పట్ట ణ పాలక సంస్థల పాత్ర కీలకమని ఆయన చెప్పా రు. సదస్సులో జాతీయ బయో డైవర్సిటీ అథారిటీ ఛైర్‌పర్సన్ సి.అచలేందర్‌రెడ్డి, మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ ఫారెస్ట్ అండ్ క్లైమైట్ చేంజ్ అడ్వయిజర్ రఘుకుమార్ కొడాలి, జాతీయ బయో డైవర్సిటీ అథారిటీ సెక్రటరీ డాక్టర్ బాలాజీ, భిక్షం, చంద్రశేఖర్‌రెడ్డి, హరీష్ చంద్రప్రసాద్, ఐసీఎల్ఈఐ అసోసియేట్ డైరెక్టర్ మోనాలిసా సేన్, సాయిరాంరెడ్డి, సంజీవ్ కార్వే, రాజ్‌కోట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ నయాన్ బెన్ పెడాడియా పాల్గొన్నారు.

‘రైతు పండుగ’ను విజయవంతం చేయాలి

కలెక్టర్ నారాయణరెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: మహబూబ్‌నగర్ జిల్లాలో శనివారం నిర్వహించనున్న రైతు పండుగ బహిరంగ సభను విజయవంతం చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా నుంచి రైతుల తరలింపునకు 140 బస్సులను ఏర్పాటు చేయాలని.. ప్రతీ బస్‌కు ఒక లైజనింగ్ ఆఫీసర్, ఒక కానిస్టేబుల్‌ను నియమించాలని సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. షాద్‌నగర్, కల్వకుర్తి నుంచి రైతులను తరలించాలన్నారు. బస్సుల్లో తాగునీరు సహా భోజన వసతి కల్పించాలని.. ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం ఇవ్వొద్దని సూచించారు.

1 నుంచి 9 వరకు ప్రత్యేక కార్యక్రమాలు

ప్రజాపాలన–ప్రజా విజయోత్సవాల్లో భాగంగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు సంబంధించి జిల్లాలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై సైతం చర్చించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్‌ఓ సంగీత, జిల్లా ప్రజా పరిషత్ సీఈఓ కృష్ణారెడ్డి, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రజాపాలన విజయోత్సవ వివరాలు

తేది	కార్యక్రమాలు
డిసెంబర్ 1	ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ రెండో పనులకు శంకుస్థాపన, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు,సీఎం కప్ క్రీడాపోటీలు
డిసెంబర్ 2	నర్సింగ్, పారామెడికల్ కళాశాల శంకుస్థాపనలు, అంబులెన్స్‌లు, ట్రాన్స్‌జెండర్స్ క్లినిక్స్ ప్రారంభోత్సవాలు
డిసెంబర్ 3	హైదరాబాద్ రైజింగ్ ఇనిషియేటివ్ ఆవిష్కరణ, జూపార్కు ఫ్లై ఓవర్ ప్రారంభోత్సవం,రూ.150 కోట్లు విలువైన సుందరీకరణ ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు
డిసెంబర్ 4	అటవీ అభివృద్ధి సంస్థ భవన నిర్మాణ శంకుస్థాపన, వర్చువల్ సఫారీ, ట్రీ ఇంటర్‌ప్రిటేషన్ సెంటర్ ప్రారంభోత్సవం
డిసెంబర్ 5	ఇందిరా మహిళా శక్తి బజార్ ప్రారంభోత్సవం, మహిళా స్వయం సహాయక సంఘాలతో చర్చలు
డిసెంబర్ 6	విద్యుత్ సబ్‌స్టేషన్లకు శంకుస్థాపన
డిసెంబర్ 7	స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ ప్రారంభోత్సవం, ఆర్ట్ ఎగ్జిబిషన్స్, సాంస్కృతిక కార్యక్రమాలు
డిసెంబర్ 8	మీ సేవా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) సిటీ ప్రాజెక్ట్, స్పోర్ట్స్ వర్సిటీ శంకుస్థాపన
డిసెంబర్ 9	తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ



అధికారులకు దిశానిర్దేశం చేస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి



నృత్యప్రదర్శనతో ఆకట్టుకున్న చిన్నారులకు మొక్కలు అందజేసి ప్రశంసిస్తున్న నేతలు

వైజ్ఞానిక ప్రదర్శలనతో ప్రతిభకు పదును

శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి

- శంషాబాద్‌లో జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభం



సైన్స్‌ఫెయిర్‌లో ఎగ్జిబిట్స్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

శంషాబాద్ రూరల్: విద్యార్థుల్లో దాగిన నైపుణ్యాలను వెలికితీయడంలో వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో ఉపకరిస్తాయని.. తద్వార వారి ప్రతిభకు మరింత మెరుగు పరచేందుకూ దోహదపడుతాయని శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఒయాసిస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన 52వ జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన, ఇన్‌స్పైర్ అవార్డుల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్నం మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ... దేశం సైన్స్‌లో ఎంతో పురోభివృద్ధి సాధించిందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని ఫలితాలు సాధించాలంటే విద్యార్థులు ఆ దిశగా ఇప్పటి నుంచే కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వైజ్ఞానిక ప్రదర్శన దినాలను పెంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

- ఎమ్మెల్సీ ఎ.వి.ఎన్.రెడ్డి మాట్లాడుతూ... పాఠశాల, కళాశాలల స్థాయిలో విద్యార్థులు ప్రాక్టికల్స్‌పై దృష్టి పెట్టకపోవడంతో ఉన్నత చదువుల్లో రాణించలేకపోతున్నారని విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు ఒకే చోట వైజ్ఞానిక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తే ఉత్తమ ఫలితాలు ఉంటాయన్నారు.
- ప్రదర్శనలను రెండు రోజులకే పరిమితం చేయకుండా ఐదు రోజులపాటు నిర్వహిస్తే ఎక్కువ మంది విద్యార్థులకు ఉపయోగపడుతుందన్నారు.
- జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి మాట్లాడుతూ... ఈ కార్యక్రమంలో 400 ప్రాజెక్టులు ప్రదర్శించడం విశేషమన్నారు. విజ్ఞానంపై విద్యార్థులకు సంపూర్ణ అవగాహన కల్పించేందుకు ఈ ప్రదర్శనలు దోహదపడతాయన్నారు. ఉన్నత పాఠశాల విద్యార్థులకు తప్పనిసరిగా ఈ ప్రదర్శనలు తిలకించి అవగాహన పెంచుకోవాలన్నారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించగా.. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్, డీఈఓ సుశీందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ పోరాటాల ఫలితమే తెలంగాణ రాష్ట్రం

- మాజీ హోంమంత్రి మహమూద్‌అలీ
- జిల్లా కార్యాలయంలో కేసీఆర్ దీక్షా దివస్



అమరుల స్తూపానికి నివాళి అర్పిస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి, మాజీ మంత్రి సబిత తదితరులు

శంషాబాద్: ప్రాణాలకు తెగించి కేసీఆర్ చేసిన పోరాటాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్ర కల సాకారం అయిందని మాజీ హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 2009 నవంబర్ 29 కేసీఆర్ దీక్ష చేపట్టిన రోజు కారణంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అధ్యక్షతన శంషాబాద్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం దీక్షా దివస్‌ను నిర్వహించారు. మాజీ సీఎం కేసీఆర్ తెలంగాణ సాధన కోసం పదవులన్నింటినీ తృణప్రాయంగా వదులుకున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. ఉద్యమ సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా కేసీఆర్ చేసిన దీక్ష ఫలితంగానే అప్పటి కేంద్ర ప్రభుత్వం దిగివచ్చిందన్నారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యమకారులు ఉద్యమ సమయంలోని విషయాలను గుర్తు చేసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, మాజీ ఎంపీపీ జయమ్మ, కౌన్సిలర్ భారతమ్మ, బీఆర్ఎస్ నాయకులు కె.శంకర్‌రెడ్డి, చక్రధర్ రెడ్డి, కొనమొల్ల శ్రీనివాస్, మోహన్‌రావు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్య డ్రైవింగ్‌కు ఏడాది జైలు

యాచారం: నిర్లక్ష్యంగా బైక్ నడిపి ఒకరి మృతికి కారణమైన వ్యక్తికి ఇబ్రహీంపట్నం న్యాయస్థానం ఏడాది జైలు శిక్షతో పాటు రూ.2 వేల జరిమానా విధించింది. యాచారం సీఐ నర్సింహారావు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని తక్కళ్లపల్లి తండాకు చెందిన గాగి, హనుమ భార్యాభర్తలు. వారు 2019లో తమ వ్యవసాయ పొలం నుంచి కాలి నడకన ఇంటికి వెళుతున్నారు. మార్గమధ్యలో నగరంలోని కాప్రాకు చెందిన సొరకాయల శ్రీను మాల్ నుంచి బైక్‌పై యాచారం వైపు వస్తుండగా భార్యాభర్తలను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో హనుమకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య గాగికి కూడా తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి పూర్తి వివరాలను కోర్టులో సమర్పించగా శుక్రవారం ఇబ్రహీంపట్నం న్యాయస్థానం నిందితుడు శ్రీనుకు ఏడాది జైలు శిక్షతో పాటు రూ.2 వేల జరిమానా విధించింది. అదే విధంగా శ్రీనుకు బైక్ ఇచ్చిన ఏపీలోని ప్రకాశం జిల్లా పొదిలికి చెందిన లక్ష్మీనారాయణకు రూ.వెయ్యి జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

డిసెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న వికారాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్‌రెడ్డి

అనంతగిరి: జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సున్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వికారాబాద్‌లోని కోర్టు భవనంలో పోలీసు అధికారులతో కోఆర్డినేషన్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లా పరిధిలోని ఠాణాలత్లో రాజీకి సిద్ధంగా ఉన్న కేసుల వివరాలను సేకరించాలన్నారు. ఆ కేసుల్లో ఇరు పక్షాల వారు డిసెంబర్ 14న నిర్వహించే లోక్ అదాలత్‌లో రాజీకి వచ్చేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తి చంద్రకిశోర్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి డీబీ శీతల్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి శృతిదూత, పీపీ సమీనా బేగం, వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, పరిగి డీఎస్పీ శ్రీనివాస్, సీఐ భీంకుమార్, రఘురాం, శ్రీనివాస్‌రెడ్డి, నవీన్‌కుమార్, ఎస్ఐలు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



రోడ్డుపై బైఠాయించిన ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు

ఏబీవీపీ శంషాబాద్ విభాగ్ కన్వీనర్ సూర్యప్రకాశ్

షాద్‌నగర్‌రూరల్: గురుకులాల్లో చదువుతున్న విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతుందని ఏబీవీపీ శంషాబాద్ విభాగ్ కన్వీనర్ సూర్యప్రకాశ్ మండిపడ్డారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) నగర కార్యదర్శి నవీన్‌నాయక్ ఆధ్వర్యంలో పట్టణ ముఖ్యకూడలిలో బైఠాయించి ధర్నా చేశారు. దీంతో కొద్దిసేపు వాహనాలు స్తంభించిపోయాయి. ఈ సందర్భంగా సూర్యప్రకాశ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పాలకులు మారినా విద్యార్థులు బతుకులు మారడం లేదన్నారు. గత పాలకులు ప్రభుత్వ విద్యను గాలికొదిలేశారని, అందుకే బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యార్థుల ఆగ్రహానికి గురికాక తప్పలేదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో విద్యార్థుల మరణాలు ఆగడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని పెట్టడం లేదన్నారు. కనీసం విద్యార్థుల సమస్యలను తెలుసుకునే ప్రయత్నం చేయడంలేదని ఆరోపించారు. రాష్ట్రంలో ఒక ఘటన మర్చిపోకముందే మరొక ఘటన జరుగుతుందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం హాస్టళ్లు, గురుకులాలు, పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు మహేందర్, వంశీ, సాయి, అనురాగ్, జశ్వంత్, అల్తాఫ్, పవన్, ధనుష్, శ్రీధర్ పాల్గొన్నారు.

రిజర్వేషన్లలో నిబంధనలు సవరించాలి

అఖిల భారత యాదవ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న రఘునాథ్‌యాదవ్

షాద్‌నగర్: ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలకు రిజర్వేషన్లలో ఉన్న నిబంధనలను ప్రభుత్వం వెంటనే సవరించాలని అఖిల భారత యాదవ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ముగ్గురు అంతకన్న ఎక్కువ మంది సంతానం ఉన్నా పోటీ చేసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అన్ని కోణాల్లో ఆలోచించి రాజకీయాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాల్లో సంతృప్తినిచ్చే విధంగా రాజకీయాల్లో సముచిత స్థానం కల్పించాలన్నారు. ప్రభుత్వం కులగణన ఆధారంగా రిజర్వేషన్లలో మార్పులు చేసి ఎన్నికలు నిర్వహించాలన్నారు. సమావేశంలో సంఘం మున్సిపాలిటీ అధ్యక్షుడు నక్క బాల్‌రాజ్‌యాదవ్, మాజీ సర్పంచ్ పల్లె శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు గంగాధర్‌గౌడ్, వెంకటేశ్‌యాదవ్, అశోక్, కృష్ణయ్య పాల్గొన్నారు.

ఫాంహౌస్‌లో హుక్కా వినియోగం

యాజమాన్యంపై కేసు నమోదు

మొయినాబాద్: ఫాంహౌస్‌లో హుక్కా, మద్యం వినియోగిస్తున్న నలుగురు యువకులతోపాటు యాజమాన్యంపై మొయినాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సంఘటన మండల పరిధిలోని చిలుకూరులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకూరు రెవెన్యూలో ఉన్న సామ్రాట్ ఫాంహౌస్‌లో గురువారం తెల్లవారుజామున నలుగురు యువకులు నిబంధనలకు విరుద్ధంగా హుక్కా, మద్యం తాగుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఫాంహౌస్‌పై దాడి చేసి నలుగురు యువకులను పట్టుకున్నారు. వారి వద్ద ఉన్న హుక్కా, మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. యువకులతోపాటు ఫాంహౌస్ యాజమాన్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

నైపుణ్యాభివృద్ధిపైనే ప్రభుత్వం దృష్టి

సాక్షి, సిటీబ్యూరో: దాదాపు 16 లక్షల ఉద్యోగాలు కొత్తగా రానున్నాయనే అంచనాల నేపథ్యంలో 2030 నాటికి నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తిని నిర్మించడంపై రాష్ట్రం దృష్టి సారిస్తోందని ప్రముఖ అంతర్జాతీయ కన్సల్టింగ్ సంస్థ 'ఈవై -పార్థినాన్, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ)' సంయుక్త నివేదిక వెల్లడించింది. సోమాజిగూడలోని పార్క్ హోటల్‌లో శుక్రవారం నిర్వహించిన ఓ సమావేశంలో 'బ్రిడ్జింగ్ ది గ్యాప్: ఇంటిగ్రేటింగ్ స్కిల్లింగ్ ఇన్ టు తెలంగాణాస్ ఎడ్యుకేషన్ సిస్టమ్ రిపోర్ట్' పేరిట రూపొందిన నివేదిక వివరాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఈవై -పార్థెనన్ భాగస్వామి డాక్టర్ అవంతిక తోమర్ మాట్లాడుతూ, 'సంప్రదాయ విద్యా నమూనాలలో నైపుణ్య విద్య, వృత్తి శిక్షణను మిళితం చేయడం ఎదుగుదలకు, పోటీతత్వానికి కీలకం. తెలంగాణకు నైపుణ్య విద్యలో పుష్కలమైన అవకాశాలు ఉన్నాయి' అని అన్నారు. సీఐఐ చైర్మన్ సాయి ప్రసాద్ మాట్లాడుతూ పరిశ్రముల ఇంటర్న్‌షిప్‌ల ఏకీకరణ, విద్యార్థులకు మాత్రమే కాకుండా, అధ్యాపకులకు కూడా ఇంటర్న్‌షిప్‌లను తప్పనిసరి చేయడం ద్వారా, అధ్యాపకులు పరిశ్రమ విధానాలతో మరింత సన్నిహితంగా ఉండేలా చూస్తున్నామన్నారు.

ఈజీ మనీ కోసమే కిడ్నాప్

- వ్యాపారిని హనీ ట్రాప్ చేసిన నిందితులు
- రూ.3 కోట్లు ఇవ్వాలని డిమాండ్
- రూ.20 లక్షలకు ఒప్పందం
- బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు
- ఐదుగురు నిందితులకు రిమాండ్
- వివరాలు వెల్లడించిన డీసీపీ సునీతారెడ్డి



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సునీతారెడ్డి, ఇతరులు

ఇబ్రహీంపట్నం రూరల్: వ్యాపారిని కిడ్నాప్ చేసి కణతకు గన్ పెట్టి బెదిరించిన కేసులో ఐదుగురు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు మహేశ్వరం జోన్ డీసీపీ సునీతారెడ్డి తెలిపారు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతోనే ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు చెప్పారు. శుక్రవారం ఆమె మీడియాకు వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇబ్రహీంపట్నానికి చెందిన రచ్చ నారాయణ (71) వివిధ వ్యాపారాలు చేస్తుంటాడు. ఇతని వద్ద పెద్ద మొత్తంలో డబ్బులు ఉన్నాయని గుర్తించిన చర్లపటేల్‌గూడ గ్రామానికి చెందిన కొరవి ధన్‌రాజు అలియాస్ అర్జున్, అలియాస్ అర్జున్‌రెడ్డి.. నారాయణ వద్ద డబ్బు కొట్టేయాలని పథకం పన్నాడు. ఇందులో భాగంగా 2023 డిసెంబర్‌లో నారాయణ పేరుతో హయత్‌నగర్‌లో రెండు రూ.100 బాండ్ పేపర్లు కొనుగోలు చేశాడు. అనంతరం కిడ్నాప్, బెదిరింపు స్కెచ్ వేశాడు. ఈ విషయాన్ని తన మేనల్లుడు శివకుమార్, స్నేహితులు శ్రీకాంత్, శేఖర్‌కు విషయం చెప్పాడు. వారు అంగీకరించడంతో ప్లాన్ అమలు చేశారు.

మహిళతో ఫోన్ చేయించి..

నారాయణను కిడ్నాప్ చేసే వ్యూహంలో నగరంలోని మౌలాలికి చెందిన మక్కల భవానికి డబ్బు ఆశ చూపారు. నారాయణకు ఫోన్ చేయించి మాయమాటలతో హనీ ట్రాప్ చేశారు. ఈనెల 21న బొంగ్లూర్ వద్దకు పిలిపించారు. అప్పటికే ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసిన పోలీస్ యూనిఫామ్‌ను ధరించిన ధన్‌రాజ్ తాను ఎస్ఐ అని చెప్పి శివకుమార్, శ్రీకాంత్, శేఖర్ తనకు గన్‌మెన్లు అని చెప్పాడు. అనంతరం నారాయణతో పాటు అతని డ్రైవర్ ముజీబ్‌ను కారులో ఎక్కించి, ముఖాలకు నల్లటి ముసుగు వేసి కిడ్నాప్ చేశారు. వీరిని ఆదిబట్ల మున్సిపాలిటీ సమీపంలోని జేబీ గ్రీన్ వెంచర్ వద్దకు తీసుకెళ్లి గదిలో పెట్టి బెదిరించారు. నీవు అమ్మాయిలతో కలిసి ఉన్న ఫొటోలు మా వద్ద ఉన్నాయన్నారు. పోలీస్ డ్రస్సులో ఉన్న ధన్‌రాజ్ చేతిలో ఉన్న గన్ తీసి నారాయణ కణతకు పెట్టి రూ.3 కోట్లు ఇవ్వాలని బెదిరించాడు. అంత డబ్బు లేదని చెప్పడంతో రూ.కోటి ఇవ్వాలని డిమాండ్ చేశారు. చివరకు రెండు రోజుల్లో రూ.20 లక్షలు ఇచ్చేందుకు ఒప్పందం చేసుకుని.. ముందుగానే తెచ్చిన 100 రూపాయల బాండ్ పేపర్లపై సంతకాలు, వేలిముద్రలు పెట్టించుకున్నారు. విషయం బయటకు చెబితే చంపేస్తామని కత్తులతో హెచ్చరించారు. అనంతరం ఏవీసీ టౌన్ షిప్ వద్ద వదిలేసి వెళ్లిపోయారు.

ఐదుగురు నిందితుల రిమాండ్..

బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఐదుగురు నిందితులను అరెస్టు చేసి, శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. వీరి నుంచి డమ్మీ పిస్టల్, పోలీసు యూనిఫామ్, బూట్లు, కత్తులను స్వాధీనం చేసుకున్నారు. వీరిలో ఏ- 1 నిందితుడు ధన్‌రాజ్ ఎంబీబీఎస్ మధ్యలో ఆపేశాడు. అనంతరం పలు ప్రైవేటు అస్పత్రుల్లో పనిచేశాడు. విలు విద్యలో గోల్డ్ మెడల్ సాధించాడు. వలవోజు శివకుమార్, డేరంగుల శ్రీకాంత్, సుర్వి శేఖర్, మక్కల భవానిని సైతం రిమాండ్‌కు తరలించారు. ఏసీపీ కేపీవీ రాజు పర్యవేక్షణలో చాకచక్యంగా కేసును ఛేదించిన సీఐ రాఘవేందర్‌రెడ్డి, ఎస్ఐలు రాజు, వెంకటేశ్, హెడ్ కానిస్టేబుల్ గిరి, రవీందర్, ఉపేందర్‌రెడ్డి, సందీప్, కృష్ణ, సంతోష్, శివచంద్ర,బీ రాజును డీసీపీ సునీతారెడ్డి అభినందించారు.



కిడ్నాప్ చేసేందుకు నిందితులు ఉపయోగించిన తుపాకీ, కత్తి ఇతర వస్తువులు

బైక్‌ను ఢీకొట్టిన కారు


వ్యక్తికి తీవ్ర గాయాలు

మొయినాబాద్: అతివేగంతో ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని కారు, బైకును ఢీకొట్టడంతో ఓ వ్యక్తికి కాలు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలోని ఎనికేపల్లి సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మొయినాబాద్ మండల పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామానికి చెందిన కట్టమీది సత్తయ్య మేస్త్రి పనిచేస్తున్నాడు. కాగా ఈ నెల 27న ఉదయం 10 గంటల సమయంలో బాకారం సమీపంలో ఉన్న డ్రీమ్ వ్యాలూ రిసార్ట్స్‌లో పనిచేయడానికి బైక్‌పై వెళ్తున్నాడు. ఎనికేపల్లి గ్రామ సమీపంలోకి వెళ్లగానే ఎదురుగా ఓ గుర్తుతెలియని కారు అతివేగంతో వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్ నడుపుతున్న సత్తయ్య కాలు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. బైక్ నుజ్జు నుజ్జయ్యింది. ప్రస్తుతం ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

కేజీబీవీ నాన్ టీచింగ్ సిబ్బందికి జీతాలు పెంచండి

లక్డీకాపూల్: కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల నాన్ టీచింగ్ సిబ్బందికి బేసిక్ వేతనాన్ని నిర్ణయించి జీతాలు పెంచాలని ప్రగతిశీల కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం నాన్ టీచింగ్, వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు ఎస్.ఎల్ పద్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజాభవన్‌లో శుక్రవారం ప్రజావాణి కార్యక్రమంలో ఈ మేరకు ఆమె నోడల్ అధికారిణి దివ్య దేవరాజ్‌కు వినతి పత్రం సమర్పించారు. అనంతరం పద్మ మాట్లాడుతూ..రాబోయే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో సానుకూలమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. జీతాలు పెంచడంతో పాటు ప్రతి నెల 5వ తేదీ లోపు వేతనాలు ఇవ్వాలన్నారు. చనిపోయిన కేజీబీవీ సిబ్బందికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలన్నారు. దీనిపై స్పందించిన దివ్య మాట్లాడుతూ.. జీతాల పెంపుదల, రిటైర్మెంట్ బెనిఫిట్ ఎక్స్‌గ్రేషియా అంశాలను ప్రభుత్వంతో చర్చిస్తామని, మిగతా సమస్యలపై విద్యాశాఖతో చర్చిస్తామన్నారని చెప్పారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 416 దరఖాస్తులు అందాయి. మైనార్టీ వెల్ఫేర్ శాఖకు సంబంధించి 158 అర్జీలు వచ్చాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 73, రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 60, విద్యుత్ శాఖ 53, హోం శాఖ 17, ప్రవాసి ప్రజావాణికి 02, ఇతర శాఖలకు సంబంధించి 53 దరఖాస్తులు అందినట్లు ప్రజావాణి కోఆర్డినేటర్ రాకేష్‌రెడ్డి తెలిపారు.

అధిక శబ్దం వస్తున్న సైలెన్సర్ల ధ్వంసం



సైలెన్సర్లను ధ్వంసం చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

అత్తాపూర్: ట్రాఫిక్ సమస్యలు, ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ ఎ.బాలాజీ అన్నారు. స్టేషన్ పరిధిలో సౌండ్ పొల్యూషన్ అధికం అవుతున్న నేపథ్యంలో శుక్రవారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. అత్యధిక శబ్దం వస్తున్న 42 వాహనాల సైలెన్సర్లను గుర్తించారు. ఆయా సైలెన్సర్లను బుల్డోజర్‌తో ధ్వంసం చేయించారు. మొత్తం 42 సైలెన్సర్ల విలువ రూ.10 లక్షల వరకు ఉంటుందన్నారు. ఇలా ప్రజలకు ఇబ్బంది కలిగించేలా ఎవరైనా ప్రయత్నిస్తే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బుగ్గ జాతరపై డీసీపీ సమీక్ష



జాతరను పర్యవేక్షిస్తున్న డీసీపీ సునీతారెడ్డి తదితరులు

మంచాల: మండల పరిధిలోని ఆరుట్ల బుగ్గ రామలింగేశ్వర స్వామి జాతరను మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి శుక్రవారం సమీక్షించారు. జాతర ఏర్పాట్లపై స్థానిక పోలీసులతో కలిసి ఆమె పర్యవేక్షణ చేశారు. భక్తుల రద్దీ, పార్కింగ్ ఇతర అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిత్యం వేలాది మంది భక్తులు వచ్చే జాతరలో పోలీసుల పాత్ర కీలకమైందన్నారు. నిరంతరం నిఘా నీడలో జాతర కొనసాగుతుందన్నారు. ప్రత్యేకంగా పోలీసు పహారా ఏర్పాటు చేయడమే కాకుండా సీసీ కెమెరాల ఆధారంగా భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. విరామం లేకుండా ఉత్సవాల్లో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందిని అభినంధించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం ఏసీపీలు రాజు, లక్ష్మీకాంత్‌రెడ్డి, సీఐ మధు, సీఐలు తదితరులు పాల్గొన్నారు.

'డీఎస్సీ పోస్టింగ్' అవకతవకలపై చర్యలకు రెడీ?

ఆర్‌జేడీ ద్వారా నేడో, రేపో ఉత్తర్వులు

సాక్షి సిటీ బ్యూరో: డీఎస్సీ కౌన్సిలింగ్‌లో పోస్టింగ్ కేటాయింపు కోసం వేకెన్సీ చూపించడంలో నిర్లక్ష్యం వహించిన ఒక డిప్యూటీ ఈఓ, ఆరుగురు డిప్యూటీ ఇనస్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ (డీఐఓఎస్)లపై శాఖపరమైన చర్యలు తీసుకునేందుకు విద్యాశాఖ సిద్ధమైంది. ఈ మేరకు సంబంధిత ఆఫీసర్లకు తగిన చర్యలకు సిద్ధం కావాలని కలెక్టర్ విద్యాశాఖాధికారికి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. దీంతో నేడో, రేపో..చర్యలుండొచ్చని సమాచారం. అయితే శాఖాపరమైన చర్యలు తీసుకోకుండా ఉండేందుకు సదరు అధికారులు ఉపాధ్యాయ సంఘాలు, ప్రధానోపాధ్యాయుల అసోసియేషన్ల మద్దతు కూడగట్టుకునే పనిలో పడ్డారు ఈ మేరకు శుక్రవారం గనఫ్రౌండ్‌లోని మోడల్ ఆలియా స్కూల్‌లో వారందరూ సమావేశం కావడం చర్చనీయాంశంగా మారింది.

ఇదీ అసలు విషయం..

2024-డీఎస్సీ లో ఈసారి వివిధ కేటగిరీల్లో 878 పోస్టులకు నోటిఫికేషన జారీ చేసిన విషయం తెలిసిందే. కౌన్సిలింగ్ ప్రక్రియ అనంతరం ఇప్పటివరకు ఇందులో 680 మంది విధుల్లో చేరారు. మిగతా 198 పోస్టులు.. కోర్టు కేసులు, ఇతర కారణాలతో భర్తీ కాకుండా నిలిచిపోయాయి. డీఎస్సీ కౌన్సిలింగ్‌లో వేకెన్సీ చూపించడంలో నిర్లక్ష్యం బయటపడింది కొంతమంది డిప్యూటీ ఇనస్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ (డీఐఓఎస్‌లు), డిప్యూటీ ఈఓలు.. జీరో టీచర్ కింద ఉన్న పాఠశాలలను పక్కన పెట్టి తక్కువ మంది విద్యార్థులున్న చోటకు అదనంగా కొత్త పోస్టులను వేకెన్సీలో చూపించారు. ఉపాధ్యాయులు అవసరం ఉన్న పాఠశాలలను వేకెన్సీ జాబితాలో పక్కనపెట్టి.. ఎక్కువ మంది పనిచేస్తున్న చోటకే మళ్లీ కొత్తవారిని కేటాయించిన పరిస్థితిపై పలు ఉపాధ్యాయ సంఘాలు ఆక్షేపించడంతో పెద్ద ఎత్తున దుమారం నెలకొంది. దిద్దుబాటు చర్యల్లో భాగంగా కౌన్సిలింగ్ పూర్తయిన రెండు వారాలకు ఒక డిప్యూటీ ఈఓ, ఆరుగురు డీఐఓఎస్‌లకు జిల్లా విద్యాశాఖాధికారి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. కాగా, జిల్లా స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ (ఎస్ఈఎం) దీనిపై విచారణ జరిపి నివేదికను కలెక్టర్‌కు అందజేశారు.

కొత్త చట్టాలతో కాలయాపనకు అవకాశం

రిటైర్డ్ జిల్లా జడ్జి మంగారి రాజేందర్

సుందరయ్య విజ్ఞానకేంద్రం: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త చట్టాలు దుర్వినియోగం అయ్యే అవకాశం ఉందని రిటైర్డ్ జిల్లా జడ్జి, తెలంగాణ స్టేట్ జ్యుడీషియల్ అకాడమీ మాజీ డైరెక్టర్ మంగారి రాజేందర్ అభిప్రాయపడ్డారు. శుక్రవారం సాయంత్రం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఆలిండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో 'క్రిమినల్ మేజర్ చట్టాలు' అనే అంశంపై సెమినార్ జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ మంగారి రాజేందర్ మాట్లాడుతూ..కొత్త క్రిమినల్ చట్టాలతో గందరగోళం, కాలయాపన జరిగే అవకాశాలు ఉన్నాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం గత క్రిమినల్ చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో కొత్తగా మూడు చట్టాలను తీసుకువచ్చిందని, ఈ నూతన చట్టాలు ఈ ఏడాది జూలై 1వ తేదీ నుంచి అమలులోకి వచ్చాయన్నారు. ఈ చట్టాలను తీసుకురావడానికి గల కారణాలపై మోదీ ప్రభుత్వం వివరణ కూడా ఇచ్చిందన్నారు. కాలం చెల్లిన నాటి వలస పాలకుల చట్టాలే ఇప్పటికీ మనం అనుసరిస్తున్నామనే భావంతో తీసుకువచ్చినప్పటికీ కొత్తచట్టాల్లో ఎక్కువగా పాతచట్టాలే ఉన్నాయన్నారు. విచారణలో మరింత జాప్యం పెరిగే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ కొత్త చట్టాల వల్ల పోలీసులకు విశేష అధికారాలు లభిస్తాయని అన్నారు. ఎఫ్ఐఆర్ నమోదు చేయించుకోవాలంటే బాధితులు ఇబ్బందులకు గురికావల్సి వస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు అడ్వకేట్ సి.వి.ఎల్.ఎన్ మూర్తి అయిలు రాష్ట్ర కార్యదర్శి కె. పార్థసారథి, సహాయ కార్యదర్శి రాంచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైన్ షాపులో మద్యం బాటిళ్ల చోరీ

శంషాబాద్ రూరల్: పాల్మాకులలోని ఓ వైన్ షాపులో గుర్తుతెలియని వ్యక్తులు మద్యం బాటిళ్లను చోరీ చేశారు. వివరాలివీ... శుక్రవారం తెల్లవారుజామున వైన్ షాప్ గోడకు కన్నం వేసి లోపలికి చొరబడ్డారు. కౌంటర్‌లో వెతికినా అందులో నగదు లేకపోవడంతో ఆరు మద్యం బాటిళ్లను తీసుకెళ్లారు. గోడ కన్నం నుంచి ఎక్కువ మొత్తంలో మద్యం బాటిళ్లను తీసుకెళ్లేందుకు యత్నించిన దుండగులు అది సాధ్యం కాకపోవడంతో గోడ బయట వదిలి వెళ్లారు. ఉదయం గమనించిన కూలీలు పోలీసులకు సమాచారం అందించారు. సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించిన పోలీసులు క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

టెన్త్‌లో 100 మార్కుల విధానాన్ని అమలు చేయాలి

కవాడిగూడ: 10వ తరగతిలో 100 మార్కుల విధానాన్ని ఈ విద్యా సంవత్సరం నుంచి కాకుండా వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎన్ రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కవాడిగూడలోని ట్రస్మా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ... ఈ విద్యాసంవత్సరం సిలబస్ ఎక్కువ శాతం పూర్తయినందున..పాత విధానంలోనే విద్యార్థులు ఇప్పటివరకు పరీక్షలు సన్నద్ధమయ్యారని, కొత్త విధానంతో విద్యార్థులు గందరగోళానికి గురయ్యే ప్రమాదం ఉందని అన్నారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి సంప్రదింపులు జరపకుండానే నూతన విధానాన్ని తీసుకురావడం అందరికీ ఇబ్బందికరంగా ఉందన్నారు.